ఎమ్మెల్యే పల్లాకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, జూన్ 22: ఇటీవల గాయపడిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కొమురవెల్లి మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం, మాజీ ఎంపీటీసీ మెరుగు కృష్ణ, నాయకులు వుడెం గోపాల్‌రెడ్డి, అత్కరి జయరాములు, దుర్గారెడ్డి, దయ్యాల ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

'పల్లా' కోలుకోవాలని...

మోకాళ్లపై వేములవాడ ఆలయం మెట్లు ఎక్కుతున్న తిరుపతిగౌడ్

చేర్యాల, జూన్ 22: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి బూరగోని తిరుపతిగౌడ్ ఆదివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతిగౌడ్ ఆలయంలోని సర్వగుండం దగ్గర పూజలు నిర్వహించి గుడి ముందరి మెట్లపై నుంచి మోకాళ్లపై నడిచి అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే రాజరాజేశ్వర స్వామి వారికి కోడెను కట్టివేసి ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని మొక్కుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కొనసాగిస్తూ అన్నివర్గాల ప్రజలకు ఎమ్మెల్యే ఎన్నో సేవలందిస్తున్నారని తెలిపారు.

బాధిత కుటుంబానికి వంటేరు పరామర్శ

మృతుడి కుటుంబీకులను పరామర్శిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 22: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పట్టణానికి చెందిన కాశమైన చేతన్‌కుమార్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ చందు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరాలు పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురై యశోద దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

స్వామివారికి పూజలు చేస్తున్న సాయిసంప్రీత్ కుటుంబ సభ్యులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 22: మండల కేంద్రమైన మద్దూరుకు చెందిన దివంగత విశ్రాంత ఉపాధ్యాయులు సాంబరాజు హరికిషన్ వ్యవసాయ క్షేత్రంలో సాంబరాజు ప్రమీల ఆధ్వర్యంలో సాంబరాజు సాయిసంప్రీత్ నిర్వహణలో భక్తాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు సాగర్‌శర్మ, పానుగంటి తిరుపతయ్యల వైదిక నిర్వహణలో అర్చనలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ, మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'మల్లన్న' క్షేత్రంలో భక్తుల రద్దీ

మహామండపంలో నిత్యకల్యాణ పూజల్లో పాల్గొన్న భక్తులు

చేర్యాల, జూన్ 22: కొమురవెల్లి మల్లికార్జున స్వామివారిని దర్శించుకోవడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దాదారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు. స్వామివారికి అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మరికొందరు భక్తులు స్వామివారి నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అలాగే కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరల వద్ద ప్రదక్షిణలు, కోడెలు కట్టి పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్ రెడ్డి, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు.

మల్లన్న భక్తులకు నిత్యం అఖండ హారతి

అఖండహారతి, సంప్రోక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో అన్నపూర్ణ

చేర్యాల, జూన్ 22: గతంలో ఎన్నడూ లేనివిధంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఈవో అన్నపూర్ణ ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే అన్నివర్గాల భక్తులకు నిత్యం అఖండ హారతి, స్వామివారికి అభిషేకం చేసిన జలంతో భక్తుల నెత్తిన సంప్రోక్షణ చేయడం(తలపై చల్లడం), భక్తుల నుదిటిపై బండారి బొట్టు పెట్టే కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం ఆలయ ఈవో అన్నపూర్ణ ప్రారంభించారు. గతం నుంచి భక్తులకు బండారి బొట్టు పెట్టే కార్యక్రమం దేవాలయంలో కొనసాగుతుండగా, తాజాగా స్వామివారిని అభిషేకించే జలంతో పాటు వచ్చే ప్రతి భక్తునికి అఖండ హారతి ఇచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుగ్గిళ్లలో చోరీ

ధ్వంసం చేసిన బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

బెజ్జంకి, జూన్ 22: మండలంలోని గుగ్గిళ్ల గ్రామానికి చెందిన కేడిక కిష్టారెడ్డి ఇంట్లో చోరీ జరిగినట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. కిష్టారెడ్డి, అతని భార్య రమ ఇంట్లో నిద్రించగా, శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చోరబడి బీరువా నుండి రూ.4.20 లక్షలు, బంగారం దొంగలించారు. సీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ శంకర్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కిష్టారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరుణుడి కరుణ కోసం కప్పతల్లి ఆట

మద్దూరు(ధూళిమిట్ట): మర్మాములలో కప్పతల్లి ఆట ఆడుతున్న చిన్నారులు

రాయపోల్: లింగారెడ్డిపల్లిలో కప్పతల్లి ఆట అడుతున్న చిన్నారులు

చేర్యాల: రాంపూర్‌లో కప్పతల్లి ఆట అడుతున్న చిన్నారులు

- డప్పుచప్పుళ్లతో ఇంటింటికి తిరుగుతూ..
- వర్షాలు కురియాలంటూ గ్రామాల్లో చిన్నారుల కప్పతల్లి ఆట
- నీళ్లు పోసి పూజలు చేస్తున్న మహిళలు
- వరుణుడు కరుణించాలని వేడుకుంటున్న రైతన్నలు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 22: మద్దూరు మండలంలోని మర్మాములలో గత 15 రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. వర్షాల కోసం గ్రామానికి చెందిన చిన్నారులు ఆదివారం కప్పతల్లి ఆటలు ఆడారు. కప్పతల్లి.. కప్పతల్లి కడువడన్నీ నీళ్లు పోయి.. అంటూ చిన్నారులు ఇంటింటికి వెళ్లి వరుణ దేవుడిని పాటల రూపంలో వేడుకుంటూ కప్పతల్లి ఆటను ఆడారు. ఇంటిముందుకు వచ్చిన చిన్నారులపై మహిళలు బిందెలతో నీళ్లు పోయడం జరిగింది. అనంతరం ఆలయం వద్ద వరదపాశంను వరుణ దేవునికి నైవేద్యంగా పెట్టి చిన్నారులు ప్రసాదంగా తీసుకున్నారు. చిన్నారులు కప్పతల్లి ఆటలు ఆడితే వర్షాలు తప్పనిసరిగా పడుతాయని గ్రామస్తులు నమ్ముతున్నారు.

లింగారెడ్డిపల్లిలో...

రాయపోల్, జూన్ 22: వరుణుడు కరుణించి వర్షాలు కురిపించాలని మండలంలోని లింగారెడ్డిపల్లిలో చిన్నారులు కప్పతల్లి ఆటలు ఆడారు. రోకలికి కట్టిన వస్త్రంతో కప్పను ఉంచి ఇంటింటికి తిరిగారు. మహిళలు బిందెల్లో నీళ్లు తీసుకొచ్చి కప్పతల్లి, చిన్నారులు తడిసేలా నీళ్లు పోశారు. ఈ సందర్భంగా వాన దేవుడో వాన దేవుడో.. వానలు కురియాలి వాన దేవుడా.. అంటూ పాటలు పాడారు. కాగా మండలంలో ముందస్తు వర్షాలతో రైతులు పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేశారు. కానీ, మొదలు వర్షాలు మురిపించి తర్వాత ముఖం చాటేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వర్షాల కోసం ప్రతి రోజు రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు.

రాంపూర్‌లో..

చేర్యాల, జూన్ 22: వరుణుడి కటాక్షం కోసం మండలంలోని రాంపూర్‌లో చిన్నారులు ఆదివారం కప్పతల్లి ఆటలు అడారు. వర్షాలు సమృద్ధిగా కురియాలని, పంటలు బాగా పండాలని కోరుతూ ఆటలు, పాడుతూ చిన్నారులు కప్పతల్లి ఆటలతో వరుణ దేవున్ని కోరుకున్నారు. చిన్నారులు రోకలికి మధ్యన సంచిలో కప్పను వేలాడదీసి డప్పుచప్పులతో ఇంటింటికి తిరిగారు. మహిళలకు కప్పతల్లిపై, చిన్నారులపై బిందెలతో నీళ్లు పోశారు. వరుణ దేవుడిని వేడుకుంటూ మొక్కులు చెల్లించుకుని భిక్షాటన చేశారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

పోగొట్టుకున్న బ్యాగును నర్సిరెడ్డికి అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

హుస్నాబాద్‌టౌన్, జూన్ 22: బస్టాండ్‌లో ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును తిరిగి వారికి అప్పగించారు ఆర్టీసీ సిబ్బంది. హుస్నాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో హుస్నాబాద్‌కు చెందిన అయిలేని రమాదేవి, శ్వేతా రెడ్డిలు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో బంధువుల ఇంటికి శనివారం రాత్రి వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చారు. హన్మకొండ బస్సు రాగానే తాము కూర్చొన్నచోటే బ్యాగును మరిచిపోయి బస్సు ఎక్కారు. కొద్ది దూరం వెళ్లిన తరువాత బ్యాగు కనిపించక పోవడంతో ఈ విషయాన్ని వారి బంధువు నర్సిరెడ్డికి తెలుపడంతో బస్టాండ్ సిబ్బందికి సమాచారం అందించాడు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులు కూర్చొనే ప్రాంగణాన్ని పరిశీలించగా బ్యాగు కనిపించింది. అందులో బంగారం, నగదు ఉన్నట్లు గుర్తించి సమాచారం నర్సిరెడ్డికి తెలిపారు. దొరికిన బ్యాగ్‌ను నర్సిరెడ్డికి అప్పగించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. బ్యాగును అప్పగించిన ఆర్టీసీ సిబ్బందిని పలువురు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

మందులు పంపిణీ చేస్తున్న వంశీధర్‌రెడ్డి

కోహెడ, జూన్ 22: మండల కేంద్రమైన కోహెడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వెంకటశ్వర్లపల్లి గ్రామ గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. కెల్విన్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ట్రస్ట్ డైరెక్టర్ గవ్వ వంశీధర్‌రెడ్డి వైద్యులతో కలిసి ప్రారంభించారు. శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు 286మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో అన్ని మండలాలలో వైద్యశిబిరాలు నిర్వహిస్తామని వంశీధర్‌రెడ్డి అన్నారు. శిబిరంలో ట్రస్ట్ అధ్యక్షుడు గవ్వ కిషన్‌రెడ్డి, నాయకులు అన్నాడి లక్ష్మారెడ్డి, కోనవేని బాలకిషన్, తిప్పరవేని భాస్కర్, పోలవేని కుమారస్వామి, వేల్పుల శంకర్, ఎండీ ఓవేజ్, శంకర్, సైఫొద్దిన్, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, నాగు ఐలయ్య, పిడిశెట్టి రాజు, సుజీత్ సహాయ సహకారాలు అందించారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే అవసరం

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న సీఐ సైదా

గజ్వేల్, జూన్ 22: ఆడపిల్లలకు ఆత్మరక్షణ కోసం కరాటే అవసరమని, విద్యార్థి దశలోనే ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని సీఐ సైదా అన్నారు. ఆదివారం పట్టణంలోని సమీట్ పాఠశాలలో కరాటే బుడోకాన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రతిఒక్కరూ క్రమశిక్షణ, ఎంచుకున్న లక్ష్యానికి చేరుకునే వరకూ పట్టుదలతో నేర్చుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితిలో 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మనీషా, బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ జిల్లా సెక్రటరీ నరేష్,కోచ్ నరేందర్, వంశీ, మహేందర్‌లు పాల్గొన్నారు.

చేర్యాల: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అపూర్వ సమ్మేళనం

చేర్యాల, జూన్ 22: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1998-99లో విద్యనభ్యసించిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాలలో 25 వసంతాల అనంతరం నిర్వహించుకున్న సమ్మేళనంలో నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి మెమోంటోలు అందించి ఘనంగా సన్మానించారు. చదువుకున్న పాఠశాలలో ఒక్కరోజు సంతోషంగా గడపడంతో పాటు నాటి ఘటనలను నెమరు వేసుకున్నారు.

బస్వాపూర్‌లో..

కోహెడ, జూన్ 22: మండలంలోని బస్వాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సంతోషంగా గడిపారు.

కోహెడ: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వైభవంగా రాజేశ్వరస్వామి కల్యాణం

ఆలయంలో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

హుస్నాబాద్‌రూరల్, జూన్ 22: మండలంలోని పొట్లపల్లి స్వయంభూరాజేశ్వరస్వామి ఆలయం 19వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో చండీహోమం, సామూహిక కుంకుమార్చన, ఎదుర్కోళ్లు, స్వయంభూ రాజేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం, పూర్ణాహుతి, అవబృంద స్నానం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో అర్చకులు అరుణ్‌కుమార్ శర్మ, రాజేశ్వరశర్మ, రామక వాసుదేవశర్మ, సతీష్‌శర్మ, నర్సింహామూర్తి, ఈవో కిషన్ రావు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన అందరి బాధ్యత

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ వాసుదేవరావు

సిద్దిపేట టౌన్, జూన్ 22: గంజాయి నిర్మూలన అందరి బాధ్యత అని సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూ టౌన్ సీఐ ఉపేందర్‌లు అన్నారు. సిద్దిపేట పాత బస్టాండ్ , రేణుక నగర్ వద్ద ప్రజలకు డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకం మూలంగా కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంజాయిరహిత జిల్లాయే పోలీసుల లక్ష్యమన్నారు. యువతకు బంగారు భవిష్యత్ ఉంటుందని, చెడు వ్యవసనాలకు అలవాటుపడి జీవితాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలు సేవించేవారు నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం, భావితరాలకు ఉన్నతమైన సమాజాన్ని అందిద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజారాం యాదవ్ తదితరులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 22: రాష్ట్ర మంత్రివర్గంలో యాదవులకు స్థానం కల్పించాలని కోరుతూ ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగే యాదవ మహాసభను విజయవంతం చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లోని తెలంగాణ కాంప్లెక్స్‌లో ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజారామ్ యాదవ్ మాట్లాడుతూ యాదవులకు మంత్రివర్గం, నామినేటెడ్ పోస్టుల్లో సైతం స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల మంది యాదవులు ఉన్నారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఆత్మగౌరవ సభకు రాష్ట్రంలోని యాదవులంతా పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, గొర్ల అయిలేష్ యాదవ్, జక్కుల రమేశ్ యాదవ్, మడక రవి యాదవ్, ఐలేవేని ప్రసాద్ యాదవ్, జంపయ్య యాదవ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ఇల్లెందుల లక్ష్మణ్‌గౌడ్, నాంపెల్లి సమ్మయ్య, ముప్పు సురేశ్, మార్క తిరుపతిగౌడ్ ఉన్నారు.

అంగన్‌వాడీ.. అగమ్యగోచరం

సిద్దిపేటలోని 5వ వార్డు శ్రీనగర్ కాలనీలో టీచర్ లేకపోవడంతో చిన్నారిని ఆడిస్తున్న ఆయమ్మ

పట్టణంలోని పలు కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ అగమ్యగోచరంగా మారింది. కేంద్రాల్లో టీచర్లు బయటకు వెళ్లడంతో బాలుడికి పక్క ఇంటి మహిళా అలనాపాలన చూడడం గమనార్హం. మరో కేంద్రంలో ఆయాయే పిల్లలను టీచర్‌గా, ఆయమ్మగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక చిన్నారికి టీచర్, ఆయమ్మ, ముగ్గురు పిల్లలు పాఠాలు బోధించడం కనిపించింది. మెహిన్‌పుర, శ్రీనగర్ కాలనీ, నల్ల పోచమ్మ కాలనీల్లో 'నమస్తే తెలంగాణ' కెమెరా కంటపడిన కొన్ని చిత్రాలు..

– నమస్తే తెలంగాణ, స్టాఫ్ ఫోటోగ్రాఫర్, సిద్దిపేట, జూన్ 22

23వ వార్డు అంగన్‌వాడీలో టీచర్ లేకపోవడంతో చిన్నారిని ఆడిస్తున్న పక్కింటి మహిళ

నీటిని పొదుపుగా వాడాలి

గజ్వేల్, జూన్ 22: కోమటిబండ నుండి వచ్చే మిషన్ భగీరథ తాగునీటి సరఫరా తగ్గించబడిందని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. పట్టణ వాసులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కొండపాక పంపింగ్ స్టేషన్‌లో పంపుల మరమ్మత్తు చేస్తున్నందున పూర్తిస్థాయిలో నీటిని అందించలేకపోతున్నట్లు హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ డిప్యూటీ జనరల్ మేనేజర్ తెలిపారన్నారు. మరమ్మత్తులు పూరికాగానే పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 22: మండల కేంద్రమైన మద్దూరులోని రామాలయం 35వ వార్షికోత్సవాలు నేడు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు పానుగంటి తిరుపతయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. అర్చకులు పార్నంది ఆంజనేయశర్మ వైదిక నిర్వహణలో ఉదయం గణపతి పూజ, అఖండ దీపరారాధన, పుణ్యావచనము, సీతారామచంద్ర స్వామి, యోగి రామలింగేశ్వరస్వామి మూర్తులకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు, భక్తులు తరలిరావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 22: మండల కేంద్రమైన ధూళిమిట్టలోని ఎస్సీ వసతి గృహంలో ప్రవేశాల కోసం నిరుపేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(వార్డెన్) సుధాకర్ ఆదివారం తెలిపారు. 3నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9441043463 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

చేర్యాల, జూన్ 22 : మండంలోని కడవేర్గు సమీపంలో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే పనులు పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందే అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు 80శాతం మాత్రమే పూర్తి చేశారని, మిగితా పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కత్తుల భాస్కర్‌రెడ్డి, నంగి కనకయ్య, పోనుగోటి శ్రీనివాస్‌రెడ్డి, మనేపల్లి కిష్టయ్య, ఎగుర్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ వివక్ష తగదు

బెజ్జంకి, జూన్ 22: దళిత కుటుంబాలపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నాయకుడు, మాలమహానాడు రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ ఎలుక దేవయ్య ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గుండారంలోని 14 మంది అర్హత గల నిరుపేద దళిత కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా ఏ ఒక్క దళిత కుటుంబానికి మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామంలో అర్హతగల నిరుపేద దళిత కుటుంబాలకు న్యాయం చేయలని కోరారు.

సర్కారు తీరు కక్షపూరితం

అక్కన్నపేట, జూన్ 22: హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తుందని మండల బీఆర్ఎస్‌వీ నాయకుడు గొపగాని అరవింద్ ఆదివారం ప్రకటనలో ఆరోపించారు. సర్కారు పనితీరును ప్రశ్నిస్తున్నందుకు కౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ఆయన అరెస్టు అప్రజాస్వామికమన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చేప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్ ముందుగా ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

ప్రభాకర్

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 22: మద్దూరు మండలంలోని సలాఖపూర్‌లో అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడిపె ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా ఎర్ర యోసేపు, కార్యదర్శిగా ఎర్ర మల్లేశ్, సలాహాదారులుగా గడిపె భిక్షపతి, ఎర్ర భాస్కర్, ఎర్రం సీమోన్, గడిపె ఎల్లయ్య, ఎర్ర రాములు, ఎర్రం భాస్కర్‌లు ఎన్నికయ్యారు. గడిపె ప్రభాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన సంఘం సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.